సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 11 । మార్చి । 2023



మహిళల సంక్షేమమే లక్ష్యం

ఇల్లంతకుంట(మానకొండూర్): మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు పేర్కొన్నారు. రూ.1.71 కోట్ల వడ్డీ రాయితీ ప్రొసీడింగ్స్ అందించారు.



కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో శుక్రవారం నిర్వహించిన శివకల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులతో బస్టాండ్ కిక్కిరిసింది.

గరిష్టం/కనిష్టం
34.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సిజేరియన్ ప్రసవాలకు అడ్డుకట్ట వేయాలి


కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో సిజేరియన్ ఆపరేషన్లకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వైద్యాధికారులతో సమీక్షించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో ప్రసూతి మరణాలు లేకుండా గర్భిణులలో రక్తహీనత లేకుండా వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణులలో హిమోగ్లోబిన్ 7 గ్రాముల కంటే తక్కువగా ఉంటే జిల్లా ఆస్పత్రికి పంపించి వైద్యసేవలు అందించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, ఉప వైద్యాధికారి శ్రీరాములు, డాక్టర్ రజిత, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్లఅర్బన్: కరాటే నేర్చుకోవడం ద్వారా ఆడపిల్లలకు ఆత్మరక్షణగా ఉంటుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. ఈనెల 12న నిర్వహించే 3వ అంతర్ రాష్ట్ర కరాటే పోటీల పోస్టర్‌ను శుక్రవారం జెడ్పీక్యాంప్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని కోరారు. కరాటే టోర్నమెంట్ చీఫ్ అడ్వయిజర్ వసంత్‌కుమార్, ఆర్గనైజర్ ఎంఏ మన్నాన్, మంగళగిరి శ్రీనివాస్, రాజేశం, తిరుపతి, రాజశేఖర్, రాజు ఉన్నారు.

తేనేటీగల పెంపకంపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ కళాశాలలో మహిళా రైతులకు పట్టుపురుగు, తేనేటీగల పెంపకంపై మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ ఉమామహేశ్వరీ పట్టుపురుగు, తేనెటీగల పెంపక విధానం, ప్రభుత్వం అందించే సబ్సిడీల గురించి వివరించారు. మల్బరీ తోటలు, పట్టుగూళ్ల విక్రయంతో మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. శిక్షణలో భాగంగా పట్టు పురుగు, తేనేటీగల పెంపకం, పరిశోధన కోసం ములుగులోని అటవీ కళాశాలకు తరలివెళ్లారు. ప్రొఫెసర్లు ప్రవీణ్‌కుమార్, మమత, శైలజ, ప్రియదర్శిని, సతీశ్ ఉన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన


ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): నెల రోజులుగా నల్లా నీళ్లు వస్తలేవంటూ మండలంలోని గూడెం ఇందిరమ్మకాలనీ మహిళలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ముస్తాబాద్, సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీకి నెల రోజులుగా నల్లాలు రావడం లేదన్నారు. బోరుబావిలో మోటార్, కరెంట్ సమస్య ఉందంటూ దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గానికి ఫిర్యాదు చేసిన మోటారు మరమ్మతు చేయడం లేదన్నారు. దీంతో వ్యవసాయబావుల వద్ద, సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నామని వాపోయారు. సమాచారం అందుకున్న సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్ మహిళలతో మాట్లాడి శాంతింపజేశారు. కొత్త మోటారు వేయిస్తామని, నీటి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు. దేవరాజు, విష్ణు, రాజనర్సు, పద్మ, అంజవ్వ, మల్లేశ్వరి, వినోద పాల్గొన్నారు.

3,850 మందికి కంటివెలుగు పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో కంటివెలుగులో భాగంగా శుక్రవారం 3,850 మందికి కంటి పరీక్షలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 560 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. 580 మందికి పాయింట్ అద్దాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా కంటివెలుగు–2లో 34 రోజులుగా 1,30,351 మందికి కంటిపరీక్షలు చేశారు. రీడింగ్ అద్దాలను 22,111 మందికి అందించారు. పాయింట్ అద్దాలను 16,646 మంది పంపిణీ చేశారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


గుడి బయట రోడ్డుపై ఎండలోనే ఉన్న భక్తులు

కల్యాణ వైభోగమే..

- అంగరంగ వైభవంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- ఉప్పొంగిన భక్తజన హృదయాలు
- రాజన్నను పెళ్లాడిన శివపార్వతులు
- లక్ష మందికి పైగా తరలివచ్చిన భక్తులు
- పనిచేయని ఎల్‌ఈడీలు.. ఎండలో ఇబ్బందిపడ్డ భక్తులు
- రేపు రథోత్సవం


రాజన్నను వివాహమాడుతున్న జోగినులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో శుక్రవారం ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య వివాహ వేడుకను అర్చకులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చేతిలో త్రిశూలం, బాసింగాలతో శివపార్వతులు రాజన్నను కల్యాణం చేసుకోగా.. వేలాది మంది తరలివచ్చిన హిజ్రాలు తలంబ్రాలు పోసుకుంటూ సందడి చేశారు. కల్యాణోత్సవంలో భాగంగా మున్సిపల్ తరఫున చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, అధికారులు స్వామికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు దాదాపు రెండున్నర గంటల పాటు కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణ వేదిక ఆలయ ఆవరణలో వేయడంతో వేలాది మంది భక్తులు ఆరుబయట ఎండలోనే ఉన్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్స్ పనిచేయలేవు. ఎంత తీవ్రంగా ఉండడం .. కనీసం టెంట్లు కూడా వేయకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. కన్యాదాతలుగా గోపన్నగారి వసంత్– సరిత దంపతులు, వ్యాఖ్యాతగా తిగుళ్ల శ్రీహరిశర్మ, చంద్రగిరి శరత్ వ్యవహరించారు. భక్తుల ద్వారా రూ.80 వేల కట్నాలు వచ్చినట్లు పీఆర్‌వో చంద్రశేఖర్ తెలిపారు. రాత్రి స్వామి వారు నెమలివాహనంపై విహరించారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వెంకటేశ్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రథోత్సవం

శివ కల్యాణోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకాలు, పారాయణాలు, బలిహరణం, సాయంత్రం శివ పురాణ ప్రవచనాలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 3.05 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.


పార్వతీరాజరాజేశ్వరుల ఉత్సవమూర్తులు


తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు


రాత్రి నెమలి వాహనంపై విహరిస్తున్న స్వామివారు


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు


తలంబ్రాలు, పట్టువస్త్రాలతో ఈవో కృష్ణప్రసాద్, ప్రతాప రామకృష్ణ, ఇతర అధికారులు

పేదల ఉసురు తగులుతుంది

- కేసీఆర్ ఈ గ్రామసభతోనైనా కళ్లు తెరవాలి
- ధరణి లోపాలను సరిచేసి పేదలను ఆదుకోవాలి
- ఇక్కడికి ఓట్లు అడిగేందుకు రాలేదు.. భూ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా
- పేదలకు భూములు పంచి, హక్కులు కల్పించి, ఆత్మగౌరవం నిలిపింది కాంగ్రెస్ పార్టీయే
- 'ధరణి అదాలత్' గ్రామసభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- బాధితులకు గ్యారంటీ కార్డులు పంపిణీ


కాంగ్రెస్ హామీకార్డును అందజేస్తున్న నాయకులు

సాక్షి, పెద్దపల్లి/ఎలిగేడు: 'సీఎం కేసీఆర్‌కు పేదల ఉసురు తగులుతుంది.. ధరణి లోపాలను సరిచేసి ఆదుకోవాలి.. ఈ గ్రామసభతోనైనా కళ్లు తెరవాలి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. 'సుల్తానాపూర్ గ్రామానికి ఓట్లు అడిగేందుకు రాలేదు.. ధరణి పోర్టల్‌తో బాధపడుతున్న మీ సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా' అని పేర్కొన్నారు. 'మీ సమస్యలు నమోదు చేసుకొని, కాంగ్రెస్ తరఫున గ్యారెంటీ కార్డులు అందించి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడానికి వచ్చా' అని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా శుక్రవారం ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామంలో మీభూమి– మీహక్కు నినాదంతో 'ధరణి అదాలత్' గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, తెలంగాణ వ్యవహారాల చైర్మన్ మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, కొప్పుల రాజు, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, విజయరమణారావు, సిరిసిల్ల రాజయ్య, మహేశ్‌కుమార్‌గౌడ్, నీలిమా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు. ధరణి బాధితులతో మాట్లాడి వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు.

ధరణితోనే సమస్యలు

'ధరణి అదాలత్' గ్రామసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో గ్రామానికో 20 నుంచి 30 సమస్యలుంటే నేడు 200 నుంచి 300 భూ సమస్యలు ధరణితో ఏర్పడ్డాయన్నారు. పేదలకు భూములు పంచి, హక్కులు ఆత్మగౌరవం కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచిన భూములను కేసీఆర్ కుటుంబీకులకు, భూస్వాములకు కట్టబెడుతుంటే తమ పార్టీ చూస్తూ కూర్చోదన్నారు. బాధితుల తరఫున పోరాడి పట్టాలు అందించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ధరణి పోర్టల్‌తో వేలాది కోట్లు కేసీఆర్ బంధువుల చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. వాళ్లందరికీ బేడీలు వేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం తెచ్చి భూములు ఉన్నవారినే కాకుండా, ఆ గ్రామంలో ఉన్న ఇతర కులవృత్తుల వారిని సైతం ఆదుకునేలా రూపకల్పన చేసింది జైరాం రమేశ్ అని వివరించారు. ఈ చట్టాలకు ప్రస్తుతం కేసీఆర్, మోదీలు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మన భూమి మనకు దక్కాలంటే అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు పల్లె రాజేశం మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన భూమి ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి తన పేరుమీద భూమి చూపియ్యడం లేదని వాపోయారు.

ఆప్షన్ లేదంటున్నారు



14 ఏళ్ల క్రితం ఇతరుల వద్ద ఎకరం భూమి కొన్నాం. పట్టా చేసి పాస్‌బుక్ తీసుకున్నాం. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత 30గుంటలే చూపిస్తుంది. 10గుంటలు ఆన్‌లైన్‌లో చూపించడంలేదు. సరి చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగిన ఆప్షన్ రాలేదంటున్నారు. 10గుంటల భూమిని ఆన్‌లైన్‌లో సరిచేయాలి.

– అప్పాల సాగర్, రైతు

పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వాలి



2009లో కాంగ్రెస్ ప్రభుత్వం 20 గుంటల లావోణి పట్టా ఇచ్చింది. ఇప్పుడున్న ప్రభుత్వం ధరణి పోర్టల్ తేవడంతో ఆన్‌లైన్‌లో నమోదు కావడంలేదు. కొత్త పాస్‌బుక్కులు ఇవ్వడంలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన మా భూమికి పట్టాలు ఇవ్వాలి.

– గౌరు శైలజ, మహిళారైతు

సారూ..బిల్లులు ఇప్పించండి

- అదనపు కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి

ముస్తాబాద్(సిరిసిల్ల): సారూ.. ఇళ్లకు బిల్లులు ఇప్పించండి అంటూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు డబుల్‌బెడ్‌రూమ్ లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ముస్తాబాద్ మండలం తుర్కపల్లి, సేవాలాల్‌తండాలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తుర్కపల్లిలో నిర్మిస్తున్న ఇళ్లకు త్వరగా బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు పనులు ప్రారంభించాలని సూచించారు. సేవాలాల్‌తండాలో ఇప్పటి వరకు జరిగిన పనులకు రికార్డులు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మునీందర్, సర్పంచులు కాశోల్ల పద్మ, శ్రీనివాస్, ఈఈ శ్యామ్‌సుందర్, డీఈ నాగరాజు, ఏఈ నరేందర్, ఆర్‌ఐ శ్యామ్, కార్యదర్శి శ్రీనివాస్,దుర్గాప్రసాద్ ఉన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సైన్స్‌పై ఆసక్తి పెంచాలి

- డీఈవో రమేశ్‌కుమార్


మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించడంతోపాటు, ఆసక్తి పెంచేలా బోధించాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. రాష్ట్ర బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి గీతానగర్ స్కూల్‌లో ఆవిష్కరించారు. గత బుధవారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్‌టెస్ట్‌లో ప్రతిభ చూపిన 56 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. తెలుగు మీడియంలో నందిని(ప్రథమ, నర్సింగాపూర్), వైష్ణవి(ద్వితీయ, ఫాజుల్‌నగర్), ఇంగ్లిష్ మీడియంలో అక్షయ(ప్రథమ, కందికట్కూర్), జశ్వంత్ (ద్వితీయ, బండలింగంపల్లి) బహుమతులు అందుకున్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ శంకరయ్య, డీఎస్‌వో పి.దేవయ్య, తిరుపతిరెడ్డి, సంతోష్, యాద రవి, హజునాయక్, సిరిపురం కుమార్, పోతుగంటి శ్రీనివాస్, తిరుపతి, సౌమ్య పాల్గొన్నారు.

'పల్లె ప్రగతి' స్ఫూర్తినిచ్చింది

- ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకున్నాం
- కలెక్టర్‌తో సివిల్ సర్వీసెస్ శిక్షణాధికారులు


సివిల్ సర్వీస్ శిక్షణాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, క్షేత్రస్థాయి అనుభవం భవిష్యత్‌లో విధుల నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుందని సివిల్ సర్వీసెస్ శిక్షణాధికారులు అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిశారు. జిల్లాలోని నామాపూర్, బస్వాపూర్, రాజన్నపేట, మర్రిపల్లి గ్రామాల్లో వారం రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన పరిస్థితులు, సంక్షేమం, అభివృద్ధి పథకాలపై అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయిలో వారు గుర్తించిన, పరిశీలించిన అంశాలను కలెక్టర్ అనురాగ్ జయంతికి వివరించారు. పల్లె ప్రగతిలో చేపట్టిన పనులు బాగున్నాయని, స్థానిక సంస్థల కృషి స్ఫూర్తిదాయంగా ఉందన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో సీహెచ్.మదన్‌మోహన్, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవోలు చిరంజీవి, లచ్చాలు, రాంరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలి

- పూర్వ విద్యార్థి గాజుల శరత్‌కుమార్
- పాలిటెక్నిక్ కళాశాలలో ఆలుమ్ని టాక్స్



మాట్లాడుతున్న గాజుల శరత్‌కుమార్

వేములవాడఅర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని కళాశాల పూర్వ విద్యార్థి గాజుల శరత్‌కుమార్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలుమ్ని టాక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థి గాజుల శరత్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఉన్నత విద్యతోనే జీవితంలో స్థిరపడగలమన్నారు. ఎలక్ట్రికల్ విద్యార్థులు కంప్యూటర్ రంగంలో ఉద్యోగాల కోసం ప్రోగ్రామింగ్ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కమ్యూనికేషన్, ప్రజంటేషన్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని తెలిపారు. కళాశాల గ్రంథాలయానికి రూ.30వేల విలువ చేసే 'ఈసెట్' ప్రవేశ పరీక్ష పుస్తకాలను అందజేశారు. అధ్యాపకులు శ్రీదేవి, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



ఎల్లారెడ్డిపేటలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్ శివారులో, స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

12న వర్కర్ టు ఓనర్ వీవింగ్‌పార్క్ సందర్శన

సిరిసిల్లటౌన్: సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న పెద్దూరు శివారులో నిర్మిస్తున్న వర్కర్ టు ఓనర్ వీవింగ్ పార్క్‌ను సందర్శించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన వీవింగ్ పార్క్‌ను శుక్రవారం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం పవర్ లూమ్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించే దిశగా వీవింగ్ పార్క్, వర్క్‌షెడ్లను నిర్మించిందన్నారు. సిరిసిల్లతోపాటు తంగళ్లపల్లిలోని టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న పవర్‌లూమ్ కార్మికులు, వార్పిన్ కార్మికులు ఆదివారం నాటి సందర్శనకు రావాలని కోరారు.

మహిళల కోసం స్వచ్ఛోత్సవ్ పురస్కారాలు

సిరిసిల్లఅర్బన్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 30 వరకు స్వచ్ఛోత్సవ్-2023 క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సర్వీసెస్, చెత్త సేకరణ, మెటీరియల్ రికవరీ, చెత్తతో కళాకృతులు, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన వంటి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఒకరు అదృశ్యం

సిరిసిల్లక్రైం: వ్యాపారం నిమిత్తం అప్పు చేసి వాటిని తీర్చలేక మనస్తాపంతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం ప్రగతినగర్‌కు చెందిన పొట్టవర్తిని అశోక్ మెడికల్ షాపు పెట్టేందుకు తెలిసిన వారివద్ద అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు షాపు నుంచి తగిన ఆదాయం రాలేదు. దీంతో మదనపడిన అశోక్ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

పొలంలోనే పోయిన ప్రాణాలు

మెట్‌పల్లి(కోరుట్ల): పంట పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మొట్లచిట్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర లింగం(51)కు గ్రామ శివారులో పొలం ఉంది. ఈ యాసంగిలో వరి సాగుచేశా డు. ఎప్పటిలాగే శుక్రవారం తన పంట పొలం వద్దకు వెళ్లాడు. పంటకు యూరియా చల్లుతూ ముందుకు సాగుతున్నాడు. అయితే, అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగిలింది. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతు రు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేర కు ఎస్సై శ్యామ్‌నాయక్ కేసు నమోదు చేసుకున్నారు.

ఏటా మనువాడి..

- లింగ, వయోభేదం లేకుండా పెళ్లి
- ఎములాడ రాజన్ననే సర్వస్వంగా..
- శివకల్యాణం రోజు వివాహమాడుతున్న వైనం..



రాజన్న కల్యాణంలో పాల్గొన్న శివపార్వతులు, భక్తులు

వేములవాడ : లింగ, వయోభేదం లేకుండా... పెళ్లిళ్లు చేసుకొని పిల్లలున్నవాళ్లు... దంపతులు.. హిజ్రాలు, జోగినులు ఇలా ఎములాడ రాజన్ననే సర్వస్వంగా భావించి అర్ధనారీశ్వరుడిగా పూజించి శివకల్యాణం రోజు వేములవాడకు చేరుకొని రాజన్నను వివాహమాడుతున్నారు. ఏటా రాజన్నను వివాహమాడుతున్న వైనంపై వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పెద్దల సూచనతో..



ఈ చిత్రంలో కనిపిస్తున్న స్వప్న, మంజులది కరీంనగర్. డిగ్రీ పూర్తిచేశారు. వీరికి పిల్లలుండగా వారి పెద్దల సూచనతో ఎములాడ రాజన్న చెంతకు చేరుకొని 2013 నుంచి శివకల్యాణం రోజున భుజానికి జోలె, చేతుల్లో త్రిశూలం పట్టుకొని శివుడిని పెళ్లాడతారు. మహా శివరాత్రి, శ్రీరామ నవమి ఉత్సవాలకు సైతం హాజరవుతామని చెబుతున్నారు. ఇలా స్వప్న మంజులే కాదు వేల సంఖ్యలో వేములవాడకు చేరుకుని ఇలా రాజన్ననే సర్వస్వంగా భావించి వివాహమాడుతుంటారు.

– నంద స్వప్న, జాతరగొండ మంజుల, గృహిణులు, కరీంనగర్

రాజన్నగానే కొలుస్తారు..



మాది హైదరాబాద్. మేము పదేళ్లగా రాజన్నను శివకల్యాణం రోజున వేములవాడకు చేరుకొని పెళ్లి చేసుకుంటాం. మా కుటుంబ సభ్యులు, బంధువులంతా మమ్మల్ని రాజన్నగానే కొలుస్తుంటారు.

– హైదరాబాద్‌కు చెందిన హిజ్రాలు

ఎడ్లబండిపై శిక్షణ అధికారులు..

- పనుల పరిశీలనకు బండిపై ప్రయాణం



ఎడ్లబండిపై వెళ్తున్న శిక్షణా అధికారులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాజన్నపేటకు ఏడురోజుల శిక్షణలో భాగంగా వచ్చిన ట్రైనీ అధికారులు శుక్రవారం పనుల పరిశీలనకు ఎడ్లబండిపై వెళ్లారు. ఎడ్లబండిపై ప్రయాణిస్తూ క్షేత్ర స్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా మారుమూల గ్రామంలో ఎన్నో అనుభూతులు కలిగాయన్నారు. అనంతరం మహిళా సంఘాలు, విద్యార్థులతో సమావేశమై ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శిక్షణా అధికారులు అర్జున్ గుప్తా, అంచల్‌జైన్, పంకజ్ మీనా, హర్షిత్ అగర్వాల్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్, సర్పంచ్ ముక్క శంకర్, కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ట్రైనీ అధికారులకు వీడ్కోలు..

వేములవాడ రూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి గ్రామానికి శిక్షణకు వచ్చి తిరిగి వెళ్తున్న ట్రైనీ అధికారులను సందర్భంగా వారిని సర్పంచ్ కట్కం మల్లేశం, గ్రామ మహిళా సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ కట్కం మల్లేశం వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, ఐకేపీ ఏపీఎం చంద్రయ్య, కార్యదర్శి వినోద్, మహిళా సంఘ సభ్యులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ఎడ్లబండిలో టేకు కలప



సిరిసిల్ల రేంజ్ ఆఫీస్‌కు టేకు కలపను తరలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎడ్లబండిని తరలిస్తున్న వ్యక్తులను చూస్తే రైతులనుకుంటాం. కానీ వారు అటవీశాఖ అధికారులు. ఎడ్లబండిలో టేకు కలపను తరలిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందడంతో వారు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు వెంకటాపూర్ వద్ద కాపుగాశారు. ఈక్రమంలో వెంకటాపూర్ శివారులో పోలీసుల పెట్రోలింగ్ వాహనాన్ని గమనించిన కలప రవాణాదారులు ఎడ్లబండిని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఎడ్లబండిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కలప కోసం మళ్లీ వారు వస్తారని భావించి నాలుగు గంటలపాటు అక్కడే వేచి చూశారు. ఎంతకీ రాకపోవడంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. సెక్షన్ ఆఫీసర్ బాపిరాజు, బీట్ ఆఫీసర్ వసుమతి ఎడ్లబండిని సిరిసిల్ల రేంజ్ ఆఫీస్‌కు తరలించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఎడ్లబండితోపాటు అందులో ఉన్న రూ.6,400 విలువ చేసే 12 టేకు దుంగలను సీజ్ చేశారు. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి



బోధనా తీరును అడిగి తెలుసుకుంటున్న శిక్షణ అధికారులు

ముస్తాబాద్ (సిరిసిల్ల): విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలని ట్రైనీ అధికారులు అన్నారు. ముస్తాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని ట్రైనీ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. విద్యార్థులకు అందిస్తున్న వసతులు, బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మద్దికుంటలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. రోగుల నమోదు, పరీక్షించే విధానం, రోగులకు అందిస్తున్న కంటి అద్దాలను పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు అభిషేక్, అమిత్, సౌరభ్, ఆన్‌మోల్, భావన, ఎంపీడీవో రమాదేవి, ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, వైద్యాధికారి గీతాంజలి తదితరులున్నారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. శుక్రవారం తెలవారుజామున కూరగాయలతో ఉన్న టీఎస్ 16 యూసీ 2292 నంబర్ గల బొలేరా వాహనం ఎండీ ముక్తార్ అనే వ్యక్తి పెద్దూరు మీదుగా సిరిసిల్ల మార్కెట్‌కు అతివేగంగా వస్తూ, అదుపు తప్పి పలువాహనాలు, చిరు వ్యాపారుల గుడిసెను, సూర రమేశ్ అనే వ్యక్తిని ఢీకొట్టింది. గాయాలపాలైన రమేశ్ ఫిర్యాదు మేరకు ముక్తార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం



వాకా నాగిరెడ్డి

సిరిసిల్ల: ప్రభుత్వం కేరళలోని శబరిమ అయ్యప్పస్వామి సన్నిధానంలో అయ్యప్ప స్వాముల వసతిగృహ నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించడం హర్షణీయమని సిరిసిల్ల అన్నపూర్ణేశ్వరి టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ వాకా నాగిరెడ్డి అన్నారు. ఏటా తెలంగాణ నుంచి లక్షలాది మంది భక్తులు శబరిమలకు వెళ్తుంటారని, భక్తులకు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ భక్తుల కష్టాలను గుర్తించి వసతి గృహానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. సన్నిధానంలో వసతి గృహాన్ని నిర్మించాలనే ఆలోచనతో నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు అయ్యప్ప సేవా ట్రస్ట్ అధ్యక్షులు కల్యాణ చక్రవర్తి, సభ్యులు ఎడమల శ్రీధర్ రెడ్డి, జూకంటి శంకర్, తన్నీరు చంద్రశేఖర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

కూతురు పెళ్లి చేశాక హఠాన్మరణం



లింబాద్రి(ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఓవైపు పచ్చని పందిరి.. మరోవైపు కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల సందడి.. అల్లారుముద్దుగా పెంచిన కుమార్తె వివాహం అంగరంగా వైభవంగా జరిగింది.. అప్పగింతలూ పూర్తయ్యాయి.. ఇక తనకంటే గొప్పెవరనుకున్నాడో ఏమోగానీ.. రాత్రివేళ హాయిగా నిద్రపోయాడు.. అంతలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు నవ వధువు తండ్రి బెజ్జారపు లింబాద్రి(55). అప్పటిదాకా ఎంతో సంతోషంగా ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగింది. కొత్తదాంరాజుపల్లిలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బెజ్జారపు లింబాద్రి – పద్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు వైష్ణవి(26), సాయిప్రియ(22). పెద్దకుమార్తెకు 2015లో వివాహమైంది. చిన్నకుమార్తె సాయిప్రియకు నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన చరణ్‌తేజ్‌తో గురువారం ఉదయం వివాహం జరిగింది. అప్పగింతలు పూర్తయ్యాయి. కొందరు బంధువులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు, కుటుంబసభ్యులు ఉదయం జరిగిన పెళ్లి కబుర్లు చెప్పుకుని సంతోషించారు. రాత్రివేళ భోజనాలు ముగించకుని నిద్రపోయారు. అయితే, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న లింబాద్రి.. అర్ధరాత్రి దాటాక సుమారు ఒంటిగంట ప్రాంతంలో గుండెపోటుకు గురై హఠాత్తుగా మృతి చెందారు. అప్పటిదాకా అందరితో ఆనందంగా గడిపిన తండ్రి హఠాత్తుగా మృతి చెందడంతో పెద్దకుమార్తె వైష్ణవి, భార్య పద్మ, కుటుంబసభ్యులు, బంధువులు బోరున విలపించారు. లింబాద్రి మృతితో కొత్తదాంరాజుపల్లిలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్ బద్దం సరిత, మాజీ ఎంపీపీ బద్దం విజయ పరామర్శించారు.

సిరిసిల్లలో టెక్స్‌ఫోర్ట్ యూనిట్



సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో టెక్స్‌ఫోర్ట్ యూనిట్ నిర్మాణ పనులు

- 2000 మందికి ఉపాధి లక్ష్యం
- అపెరల్ పార్క్‌లో వర్క్‌షెడ్ల నిర్మాణం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి మరో గార్మెంట్ పరిశ్రమ వస్తోంది. రెడీమేడ్ వస్త్రాల తయారీలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్ సిరిసిల్ల శివారులోని పెద్దూరు అపెరల్ పార్క్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో ఆ కంపెనీ ఎంవోయూ పూర్తి చేసుకోగా.. అపెరల్ పార్క్‌లో వర్క్ షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రత్యేక చొరవతో సిరిసిల్లలో 2000 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ పరిశ్రమను పెట్టేందుకు ముందుకొచ్చింది. ఇప్పటికే గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను స్థాపించి 500 మందికి ఉపాధి కల్పిస్తుంది. మరో వెయ్యి మందికి ఉపాధి కల్పించే దిశగా ముందుకు సాగుతోంది. గోకుల్‌దాస్ సంస్థ లోదుస్తులను తయారీ చేస్తూ విదేశాలకు ఎగుమతి చేస్తుంది. దీనికితోడుగా మరో అంతర్జాతీయ సంస్థ టెక్స్‌ఫోర్ట్ సిరిసిల్లలో పరిశ్రమను స్థాపించేందుకు ముందుకు రావడంతో 2000 మందికి ఉపాధి లభించనుంది. మరో ఆరు నెలల్లో వర్క్‌షెడ్ల నిర్మాణాలు పూర్తికానున్నాయి. జిల్లా వ్యాప్తంగా బీడీలు చేస్తూ అరకొర ఆదాయంతో ఇబ్బంది పడుతున్న మహిళలకు ఈ కంపెనీలతో పుష్కలమైన ఉపాధి లభించనుంది. యువకులు సైతం ఇక్కడ పనులు గల్ఫ్ బాట పడుతున్న వారు అనేకం. అటు మహిళలకు, ఇటు యువకులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు దొరకనున్నాయి. సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద 66 ఎకరాల్లో అపెరల్ పార్క్‌ను ఏర్పాటు చేయగా.. మరిన్ని కంపెనీలు రానున్నాయి.

షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి



పెద్దూరు అపెరల్ పార్క్‌లో టెక్స్‌ఫోర్ట్ కంపెనీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. మంత్రి కేటీఆర్ సమక్షంలో ఎంవోయూ పూర్తి చేసుకుంది. ఆ సంస్థకు సంబంధించిన వర్క్‌షెడ్లు నిర్మాణంలో ఉన్నాయి. మరో ఆరు నెలల్లో పనులు పూర్తవుతాయి. ఈ సంస్థ పని ప్రారంభిస్తే మరింత మందికి ఉపాధి లభిస్తుంది.

– అశోక్‌రావు, జౌళిశాఖ డిప్యూటీ డైరెక్టర్

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తున్న సదానందం

వేములవాడ : వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి గుడిసె సదానందం శుక్రవారం ప్రకటించారు. గత కార్యవర్గం చివరి సమావేశాన్ని బార్ రూంలో అధ్యక్షుడు వేముల సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎన్నికల అధికారిగా గుడిసె సదానందంను ఏకగ్రీవంగా నియమించారు. ఇప్పటి వరకు పనిచేసిన కార్యవర్గానికి సభ్యులంతా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, చెర్ల ఆనంద్‌కుమార్, గడ్డం సత్యనారాయణ రెడ్డి, బొడ్డు ప్రశాంత్, జంగం అంజయ్య, పొత్తూరి అనిల్‌కుమార్, గుండా రవి, పిట్టల మనోహర్, విద్యాసాగర్ రావు, పెంట రాజు, నర్సింగరావు, దివాకర్, సుజీవన్, గంగరాజు, పర్లపెల్లి అంజయ్య, శేఖర్, అభిలాష్, మహేశ్, ప్రతాప సంతోష్, శంకర్, రాజ్‌కుమార్, సుజాత, అన్నపూర్ణ, సుప్రియ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారిగా నియామకమైన గుడిసె సదానందం తెలిపారు. ఈ మేరకు 87 మంది ఓటర్ల తుదిజాబితాను విడుదల చేశారు. ఈనెల 24న నామినేషన్ స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. 25 నుంచి 27వరకు ప్రచారం, 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్, ఓట్ల లెక్కింపుతో పాటు గెలుపొందిన అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకొని ఎన్నికల అధికారికి సహకరించాలని ఆయన కోరారు.

సామాజిక చైతన్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే

- నివాళి అర్పించిన ఉపాధ్యాయులు



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: మహిళా సామాజిక చైతన్యం కోసం సావిత్రిబాయి పూలే సేవలు అనిర్వచనీయమని ఉపాధ్యాయులు, అనుబంధ సంఘం నాయకులు కొనియాడారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మైలారం తిరుపతి, సైన్స్ అధికారి పాముల దేవయ్య, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, బీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేశం, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, నాయకులు బొజ్జ కృష్ణ, రాజిరెడ్డి, సంజీవ రెడ్డి, మనోహర్, రాంబాబు, తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, రాజేందర్, రాంబాబు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం

- ఒకరికి గాయాలు



నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

సిరిసిల్లఅర్బన్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. (టీఎస్ 16 యూసీ 2292) అనే నెంబర్‌గల బొలెరో వాహనం టమాటాల లోడుతో కామారెడ్డి వైపు నుంచి సిరిసిల్లకు వెళ్తోంది. పెద్దూరు బస్టాండ్ వద్దకు రాగానే అదుపుతప్పి అక్కడే ఉన్న మంగళాపు అంజయ్య హోటల్ వద్ద ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో హోటల్ ముందు పార్క్‌చేసిన శివరాత్రి నాగరాజు, బడుగు దేవయ్య, సూర రవికి చెందిన ద్విచక్రవాహనాలు దెబ్బతినగా రవికి స్వల్ప గాయాలయ్యాయి. బొలెరో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో గాయపడిన రవిని వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

నర్సింహుల చిన్న చెరువుకు నీటి విడుదల



చెరువు వద్ద రైతులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలంలోని నర్సింహుల పల్లె గ్రామ పరిధిలోని నర్సింహుల చిన్న చెరువుకు శుక్రవారం రంగనాయక సాగర్ నుంచి విడుదల చేశారు. సర్పంచ్ సరిదెన ఆనందరావు, ఎంపీటీసీ బైరినేని రాముతో కలిసి రైతులు నర్సింహుల చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో చెరువులు నిండి నీళ్లు మత్తడి దూకడం ఆనందంగా ఉందన్నారు. తమ పంట పొలాలు ఎండిపోకుండా రక్షించేందుకు కాళేశ్వరం ద్వారా నీటిని అందించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకుడు బొంగరం జనార్దన్ రెడ్డి, రెడ్డిమల్ల నర్సయ్య, చెక్కపల్లి లింగారెడ్డి, కొండేటి యాదిరెడ్డి, పతూరి మహిపాల్ రెడ్డి, మహిమల బాపురెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును

■ సిరిసిల్ల గాంధీనగర్, లక్ష్మీటాకీస్ ఎదురుగా మార్కెట్ ఏరియాలో 3 షెటర్లు 4 ఫ్లోర్లు 2000 చ.ఫీట్లు గలది బిల్డింగ్ కిరాయకు ఇవ్వబడును. సంప్ర॥ 9440488956, 9490257222. [K-1219911]

WANTED

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర : 90300 07628 [L-537]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190584]

■ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9640258899, 9640468899 [H-786847]

■ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు M/F టెలికాలర్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను జీ: 10-15K, బోడుప్పల్, Pillar No.77, ఫోన్ : 7981208120, 9032055834 [H-792949]

FACULTY TEACHERS

■ Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-, Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-985]



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824